**కథ**

# ఒరవడి

సాయంకాలం నాలుగు అవుతున్నా ఎండ తగ్గలేదు. స్కూలునుంచి గంట ముందుగా యింటికొచ్చేసి రిలాక్స్‌గా కాళ్లు స్టూలుమీదకు చాపుకుని ఫ్యాన్ కింద కూర్చుంది కాత్యాయని. కానీ వేడిగా గాలి! స్కూలులో సుఖంగా లేదని ఎగగొట్టి వస్తే ఇంట్లోనూ సుఖంగా లేదు.

ఎదురుగా వున్న ర్యాక్ నిండా పరీక్ష పేపర్లున్నాయి. సంవత్సరం పూర్తికావస్తున్నా ఆ పేపర్లను దిద్దే ఓపిక, తీరిక ఆమెకు లేకపోయాయి. అయితేనేం- రిజిస్టర్‌లో మార్కులు మాత్రం నమోదు చేసేసింది. లేకపోతే వీళ్లిచ్చే జీతానికి పేపర్లు కూడా దిద్దాలా? అని నవ్వుకుంది.

క్రికెట్ బ్యాట్ ఊపుకుంటూ బయటకు వెళ్తున్న కిరణ్ కంట పడగానే ఆమె ముఖం గంభీరంగా మారిపోయింది. ''పరీక్షలకు పట్టుమని పదిరోజులైనా లేవు. చదువుకోకుండా ఎక్కడికి పోతున్నావురా'' అని గద్దించింది.

కిరణ్ ఆగాడు కాని సమాధానం చెప్పలేదు. గాలిలో బ్యాట్ జాడిస్తూ సిక్సర్ బాదినట్టు మురిసి పోతున్నాడు.

అలా గద్దించినందుకు కొడుకు బాధపడ్డాడేమోనని నొచ్చుకుని, లేచి కిరణ్ తల నిమురుతూ ''ఈ ఎండలో ఆటలేమిటిరా! పోయి చదువుకో'' మృదువుగా అంది కాత్యాయని. చిన్నగా నవ్వి నిర్లక్ష్యంగా వెళ్లిపోయాడు కిరణ్.

కాత్యాయని మనస్సు చివుక్కుమంది. ఎంతో వినయంగా, ఒద్దికగా ఉండే కిరణ్ మారిపోయాడీమధ్య. వాడు మంచి ర్యాంకులు తెచ్చుకోవాలనీ, వాడి భవిష్యత్తు బ్రహ్మాండంగా ఉండాలనీ, తను పనిచేస్తున్న ప్రభుత్వ పాఠశాలలోకాక వాడిని హైటెక్ కాన్వెంట్‌లో భారీ డొనేషన్ కట్టి చేర్పించింది. భారీ ఫీజులు కడుతోంది.

**''నీతిగా ఆదర్శప్రాయంగా జీవిస్తూ కన్నబిడ్డలకు ఒరవడిగా ఉండవలసిన పెద్దలు నీతిమాలిన పనులు చేస్తూ దుర్మార్గంగా ప్రవర్తిస్తున్నారు. కానీ దేవుని ప్రతిరూపాలయిన పసిబిడ్డలే కల్లాకపటం లేకుండా నీతిగా బుద్ధిగా ఉంటున్నారు. నిజానికి పసిబిడ్డలే పెద్దలకు ఆదర్శప్రాయులు. వారే పెద్దలకు ఒరవడి చూపే తల్లిదండ్రుల్లాంటివారు''**

కిరణ్ కూడా మొదట్లో శ్రద్ధగా, బుద్ధిగా చదువుకునేవాడు. క్లాస్‌లో ఫస్ట్ వచ్చేవాడు. కానీ పదోక్లాసులోకి రాగానే కిరణ్ మారిపోయాడు. ఈమధ్య టీచర్స్‌తో వాదనకు దిగడం, ఎదిరించడం చేస్తున్నాడట.

''ఇలా అయితే స్కూలులోంచి పంపేస్తాము. మీరు కూడా టీచరే కదా! వాడిని దారిలో పెట్టాల్సిన బాధ్యత మీకూ ఉంది'' అని ఫోన్‌చేసి హెచ్చరించింది వాళ్ళ ప్రిన్సిపాల్.

నీరసంగా కుర్చీలో కూలబడింది కాత్యాయని. సరిగా అప్పుడే కరెంట్ కట్. ఫ్యాన్ ఆగిపోయింది. చరచర చెమటలు. ఒళ్ళు చిరచిర.

''ఛీ...వెధవ ప్రభుత్వం, కరెంట్ సరిగా ఇవ్వలేని అసమర్ధ ప్రభుత్వం'' అని తిట్టుకున్నా మనశ్శాంతి లభించలేదు.

మళ్లీ కిరణ్ గురించే ఆలోచనలు. వాడిమీద ఎన్ని ఆశలు పెంచుకుంది తను! డాక్టరో, కంప్యూటర్ ఇంజనీరో అయి విదేశాలకు వెళ్లి తమకు ఎంతో పేరు తెస్తాడని ఎన్నో కలలు కన్నది. కానీ వాడు చెడిపోతున్నాడన్న బెంగ ఇప్పుడు. ఆ బెంగకన్నా తను వాడిని దారిలో పెట్టలేకపోతున్నందుకు మరింత బెంగ. వాడిని ఎలా దారిలో పెట్టాలి?

కాత్యాయని భర్త కాంభోజరావుకెప్పుడూ టూర్‌లే. ఊళ్ళు పట్టుకు తిరిగే తీరికలేని ఉద్యోగం. రెండుచేతులా సంపాదన. ఊరినిండా గొప్ప పేరు, పలుకుబడి. ఆయన ఊరిలో ఉండేదే వారానికి రెండురోజులు. ఆ రెండురోజులైనా ఇంటిపట్టున వుండడు. క్లబ్బులలో స్నేహితులతో కాలక్షేపం. ఇక ఆయన కొడుకునేం దారిలో పెడతాడు? చేసేదేదో తనే చేయాలి. కానీ ఎలా?

వీపుమీద బస్తా పుస్తకాలు మోసుకుంటూ, ఒంటినిండా చెమటతో కాంతి స్కూలునుంచి రాగానే తిరగని ఫ్యాన్ వంకచూసి ''అయ్యో కరెంట్ లేదా?'' అని నిట్టూర్చింది.

పుస్తకాల బస్తాని పొందికగా టేబుల్ మీద వుంచి బాత్రూంకి వెళ్లి ముఖం, కాళ్ళు చేతులు శుభ్రంగా కడుక్కుంది. యూనిఫాం తీసేసి హేంగర్‌కి తగిలించి కాటన్ ఫ్రాక్ తొడుక్కుని లైట్‌గా పౌడర్ అద్దుకుంది. కిచెన్‌లోకి వెళ్లి టీచేసి తనొక కప్పు తీసుకుని అమ్మకొక కప్పు తెచ్చి ఇచ్చింది.

హఠాత్తుగా కరెంట్ రావడంతో ఫ్యాన్ డ్యూటీ ప్రారంభించింది. టీ తాగుతున్న కాత్యాయనికి ఎంతో హాయిగా అనిపించింది. ఆప్యాయంగా కూతురు తల నిమిరింది.

ఏమిటో కొడుకు కొడుకు అని వెంపర్లాటేగానీ వాడు పెద్దయ్యాక తమని సరిగా చూస్తాడో లేదో? కూతురే నయం అనిపించిందామెకు ఆ క్షణంలో.

కానీ ఏదో ఉద్ధరిస్తాడని కొడుకుని భారీ ఫీజుల హైటెక్ కాన్వెంట్‌లో చేర్పించిన తనే కూతుర్ని తక్కువ స్థాయి కాన్వెంట్‌లో చేర్పించింది. ఆ విషయం ఆమెకా క్షణంలో జ్ఞాపకం రాలేదు మరి!

''ది చైల్డ్ ఈజ్ ది ఫాదర్ ఆఫ్ మ్యాన్ అంటే ఏమిటి మమ్మీ?'' హఠాత్తుగా జ్ఞాపకం వచ్చినదానిలా అడిగింది కాంతి.

అచ్చుపుస్తకం తీసుకుని ఆ వాక్యం వున్న పేరా చదివింది కాత్యాయని. కానీ అర్థం కాలేదు. పదాల అర్థాలను పేర్చుకుంటూ ''చిన్నపిల్లవాడే మనిషి తండ్రి'' అని చెప్పిందిగానీ తనకే సంతృప్తిగా లేదు.

''మీ టీచర్‌ని అడగలేకపోయావా?'' అంది చిరారుగా.

''నీకు తెలియదుగానీ రాధ ఆంటీని అడిగి వస్తానుండు'' అంటూ పుస్తకం తీసుకుని తుర్రుమంది కాంతి.

గునపంతో గుండెల్లో పొడిచినట్లు విలవిలలాడిపోయింది కాత్యాయని.

రాధ...తన చిన్ననాటి స్నేహితురాలే. డిగ్రీవరకు కలిసే చదివారు. తర్వాత వివాహాల వల్ల విడిపోయారు. పిల్లలు పుట్టి వాళ్ళు ఎదిగాక ఇంటిలో ఖాళీగా కూర్చోవడం ఎందుకని ఇద్దరూ బి.ఇడీ చేసారు. ఆ తర్వాత భర్తల బదిలీలవల్ల విచిత్రంగా మళ్లీ ఈ ఊళ్ళో కలిసారు.

హఠాత్తుగా ప్రభుత్వం కొన్నివేల ఉపాధ్యాయుల పోస్టుల కోసం రాత పరీక్షలు నిర్వహించడం, పదేళ్ళనుంచి నిరుద్యోగంతో ముక్కిపోయినవాళ్ళంతా పరీక్షలకు ఎగబడడం, అదృష్టవశాత్తు తను పాస్ అయి ఉన్న ఊళ్ళోనే ప్రభుత్వ ఉద్యోగం సంపాదించడం, రాధ కూడా పాసైనా ఉద్యోగం దొరకక వెయ్యిరూపాయల జీతానికే ఏదో కాన్వెంట్‌లో వెట్టి చాకిరీ చేస్తూ వుండడం అంతా నిన్నామొన్నా జరిగినట్టే వుంది.

రాధ ఉండేది తమ ఇంటికి దగ్గరే. తను వాళ్లింటికి ఎప్పుడూ వెళ్లకపోయినా రాధ అప్పుడప్పుడు తమ ఇంటికొచ్చి పిల్లలతో కాలక్షేపం చేస్తూ వుంటుంది. కాంతికి, కిరణ్‌కి ఆమె అంటే అమిత గౌరవం, ప్రేమ. తనకే అసూయ కలిగేది.

రాధ కొడుకు రమేష్‌ది కిరణ్ వయస్సే. తల్లి పనిచేస్తున్న కాన్వెంట్‌లోనే పదోక్లాసు చదువుతున్నాడు. చూడ ముచ్చటగా, చురుకుగా ఉంటాడు.

కాత్యాయని ఆలోచనలకు అంతరాయం కలిగిస్తూ

''మమ్మీ! ఆ వాక్యానికి అర్థం తెలిసిపోయింది'' అని అరుస్తూ చెంగుచెంగున ఎగురుతూ వచ్చింది కాంతి. చీకటిగా ఉండడంతో లైట్లు వేసింది. ఎదురుగా కూర్చుని వివరణ మొదలుపెట్టింది.

''నీతిగా ఆదర్శప్రాయంగా జీవిస్తూ కన్నబిడ్డలకు ఒరవడిగా ఉండవలసిన పెద్దలు నీతిమాలిన పనులు చేస్తూ దుర్మార్గంగా ప్రవర్తిస్తున్నారు. కానీ దేవుని ప్రతిరూపాలయిన పసిబిడ్డలే కల్లాకపటం లేకుండా నీతిగా బుద్ధిగా ఉంటున్నారు. నిజానికి పసిబిడ్డలే పెద్దలకు ఆదర్శప్రాయులు. వారే పెద్దలకు ఒరవడి చూపే తల్లిదండ్రుల్లాంటివారు'' అలా చెబుతున్నప్పుడు ఒక కొత్త విషయాన్ని తెలుసుకున్న ఆనందం కాంతి స్వరంలో వెల్లివిరిసింది.



నిజమే సుమా! ఇప్పుడు ఓస్ ఇంతేనా అనిపిస్తుందిగానీ ఆ వాక్యం చదివినప్పుడు తనకెందుకు అర్థం కాలేదు. రాధకు ఎందుకు అర్థం అయింది?

కాంతి ఆ వాక్యం అర్థం వివరించి ఊరుకోలేదు. ''ఛీ! ఫో మమ్మీ! పెద్ద టీచర్‌వేగానీ నీకేమీ తెలియదు'' అంటూ లోనికి వెళ్ళిపోయింది.

కాత్యాయని హృదయం చిదిగిపోయింది. ఎలక్ట్రానిక్స్ యుగం. పెద్దా చిన్నా చూడకుండా ఎంతమాట పడితే అంతా అనేస్తారు అని సర్ది చెప్పుకుంది తనకి తానే.

గడియారం తొమ్మిది కొట్టిందిగానీ కిరణ్ ఇంకా రాలేదు.

''క్రికెట్ అవగానే ఇంటికి రావచ్చుకదా! ఇంతవరకూ ఆ తిరుగుళ్ళు ఏమిటి? లాభంలేదు. వీడిని గట్టిగా మందలించాలి'' అని తీర్మానించుకుంది.

తల్లీ కూతురు భోజనం చేసారు. కాసేపు టీవీ చూసి నిద్రపోయింది కాంతి. పది దాటాక అప్పుడు ఇంటికొచ్చాడు కిరణ్.

స్నేహితుని బర్త్‌డే అట. సినిమా చూసి ఆ తరువాత హోటల్‌లో భోజనం చేశారట. వేలెడులేడు వెధవ. వీడు ఇంటిలో ముందుగా చెప్పకుండా సినిమాలు, హోటల్ భోజనాలు.

ముంచుకొచ్చిన కోపాన్ని బలవంతంగా దిగమింగింది కాత్యాయని.

ముఖం కడుక్కుని నైట్‌డ్రెస్ వేసుకుని మంచంమీద చెల్లి ప్రక్కనే నడుము వాల్చాడు కిరణ్.


లైటార్పి, నైట్‌లాంప్ వెలిగించి వాడి ప్రక్కనే కూర్చుంటూ మృదువుగా హితభోద మొదలుపెట్టింది కాత్యాయని.

''బాగా చదువుకుని మంచి ర్యాంక్ తెచ్చుకుని గొప్ప డాక్టరో, ఇంజనీరో అవాలని బోలెడు డబ్బు ఖర్చుపెట్టి నిన్ను హైటెక్ కాన్వెంట్‌లో చదివిస్తుంటే నువ్వేమో ఆటల్లో పడి చదువుకు ఎగనామం పెట్టడం ఏమన్నా బాగుందా చెప్పు?'' తల నిమురుతూ అంది.

లేచి కూర్చుని అమ్మ చెబుతున్నది శ్రద్ధగా వింటున్నట్లు ఫోజు పెట్టి చివరకు ''మార్కులు రావాలంటే కష్టపడి చదవనక్కరలేదు మమ్మీ. ఐదువందలు పారేస్తే చాలు మా ప్రిన్సిపాల్ పరీక్షల్లో కాపీలు అనుమతిస్తుంది. రెండువేలు పారేస్తే చాలు నా బదులు మరొకడు పరీక్షలు రాస్తాడు. ఇట్స్ ఈజీ మమ్మీ'' అన్నాడు తేలికగా.

షాక్ అయింది కాత్యాయని. పదోక్లాసు చదువుతున్న కుర్రాడు పరీక్షల్ని, జీవితాన్ని ఇంత తేలిగ్గా తీసుకోవడం దిగ్భ్రాంతిగా ఉందామెకు. గదినిండా పరుచుకున్న నీలం కాంతిలో కిరణ్ పిశాచపు పిల్లాడిలా వింతగా

చంపక్



## మెదడుకు కాపలా కాసే రోబో!

ప్రపంచంలో అర్థంకాని రహస్యాల్లో ఒకటి-మెదడు చేసే పని. ఎన్ని ప్రయత్నాలు, మరెన్ని ప్రయోగాలు చేసినా, మస్తిష్క రహస్యం యింకా బయటపడలేదు.

లండన్ విశ్వవిద్యాలయంలో పరిశోధనగావిస్తున్న డాక్టర్ నీల్ వర్జేస్ మెదడులోని క్లిష్టతను అర్థం చేసుకోడానికి రోబోట్ సహాయం తీసుకోవాలనుకున్నాడు.

చిత్రంలో తన కళ్ల ఎదురుగా వున్న రోబోతో-'మస్తిష్కంలోని జ్ఞాపకశక్తి, కల్పనాశక్తి ఎలాంటిదని' అడుగుతున్నట్టుంది. ఆకలి వేసినప్పుడు ఎలుకలు ఎలా ప్రవర్తిస్తాయన్న క్రియపై ప్రయోగం చేశాడు. అప్పుడు మెదడులో జరిగే క్రియ ఏమిటి? రోబోట్‌ను ప్రయోగించినప్పుడు అది అన్నం వెదుక్కునే ప్రక్రియలోనే మునిగిపోయింది. అప్పుడు మెదడులోని హిపోకేంపస్ భాగాన్నే, మనిషి కూడా ఉపయోగిస్తున్నట్టు రోబోట్ ప్రయోగం వల్ల తేలింది.

**-సి.వి.కె.**

కనిపించాడామెకు. కాదు వీడు నా కొడుకు కాదు. నా కొడుకే అయితే ఇంత నిర్లక్ష్యంగా మాట్లాడడు అనుకుంది.

ఆమె ఆలోచనల్ని గ్రహించినట్టే ఉన్నాడు కిరణ్. వాడి పెదవులు చిరునవ్వులాగా చిన్నగా విచ్చుకున్నాయి.

''నా భవిష్యత్తు గురించి నీకెందుకు మమ్మీ బెంగ? డాడీ బోలెడు సంపాదిస్తున్నారు. నాకు మంచి రేంక్ వచ్చేటట్లు ఆయన చూసుకుంటారులే. ఆయన సంపాదించిన లక్షలు నాకు ఉద్యోగాన్ని బంగారుపళ్లెంలో పెట్టి మరీ ఇస్తాయి. మరెందుకు బెంగ?'' అన్నాడు.

ఆ స్వరంలోని వ్యంగ్యం ఆమె హృదయాన్ని ఛిన్నాభిన్నం చేసింది. ఉప్పెనలా లేచిన ఆ ఆగ్రహాన్ని నిగ్రహించుకోవడానికి సతమతమయింది.

గొప్ప జీవిత సత్యాన్ని ఆవిష్కరించినవాడిలా నవ్వాడు కిరణ్.

దాంతో కాత్యాయని హృదయం భగ్గుమంది. ఇంక నిగ్రహించుకోలేకపోయింది.

''ఏమిట్రా ఆ వాగుడు? తిక్కగా ఉందా? ఆ రమేష్‌ని చూసైనా బుద్ధి తెచ్చుకోరా'' అని అరుస్తూ ఆ చెంపా, ఈ చెంపా ఫట్‌ఫట్ లాడించింది. ఇంకా కసితీరక వాడి జుట్టు దొరక పుచ్చుకుని గుంజేసింది.

అయితే అమ్మ ఆర్భాటం చూసి కిరణ్ భయపడలేదు. ఆమె చేతిని విసిరికొట్టి కాస్త దూరంగా జరిగి ''మమ్మీ! నన్ను రమేష్‌తో పోల్చితే నిన్ను వాడి మమ్మీతో పోల్చవలసి వుంటుంది జాగ్రత్త'' అన్నాడు రోషంగా.

''ఏమిట్రా! ఏమిట్రా నీ ఉద్దేశ్యం?'' గద్దించింది కాత్యాయని.

కిరణ్ హేళనగా నవ్వాడు.

''మమ్మీ! నువ్వు పరీక్షలు ఎలా పాస్ అయ్యావో, ఎలా ఉద్యోగం సంపాదించావో ఆ వివరాలన్నీ నాకు తెలుసు మమ్మీ! ఏం, ఆ వివరాలు చెప్పమంటావా?'' బెదిరిస్తున్నట్లు అడిగాడు. ఆ స్వరంలో అధికారం విని విస్తుపోయింది కాత్యాయని.

''టీచర్ రిక్రూట్‌మెంట్ పరీక్షల్లో డాడీ ఒక వాచర్‌కి డబ్బు ఇచ్చి లోబరచుకున్నారు. రెండోవాడు కఠినంగా ఉండేసరికి పరీక్ష రాస్తున్న మీరంతా లేచి 'ఇది మా జీవన్మరణ సమస్య సార్! మీరు కఠినంగా ఉంటే మాకు ఉద్యోగాలు రావు. మేమంతా కట్టకట్టుకుని చావాలి' అంటూ ఎమోషనల్‌గా బ్లాక్‌మెయిల్ చేసి అతగాడు మెత్తబడగానే మీరంతా యధేచ్ఛగా కాపీ కొట్టుకున్నారు. రాధ ఆంటీలాంటి ఒకరిద్దరు నిజాయితీగా పరీక్షలు రాసిన పాపానికి రాధా ఆంటీకి నీకన్నా తక్కువ మార్కులు వచ్చాయి. నువ్వు పరీక్ష పాసైన తర్వాత డాడీ అందరి కాళ్ళూ పట్టుకుని ఎనభైవేలు లంచం ఇచ్చి నీకు ఈ ఊళ్లోనే ఉద్యోగం వచ్చేట్టు చేశారు. అవునా కాదా?''

నరకంలో అగ్నిగుండంలో నిలబెట్టి సాక్షాత్తూ ఆ యమధర్మరాజే విచారణ జరుపుతున్నట్లు గజగజలాడిపోయింది కాత్యాయని. వంట్లోని శక్తి అంతా హరించుకుపోయి నిస్త్రాణగా ఉండిపోయింది.


''మమ్మీ! స్కూలులో నా ప్రవర్తన గురించి ఆరా తీయడానికి రహస్యంగా నువ్వు మా స్కూలుకు వచ్చినట్టే నేనూ మీ స్కూలుకు వచ్చాను మమ్మీ!''

ఉలిక్కిపడి కిరణ్ వైపు తేరిపార చూసింది కాత్యాయని.

''నీ స్టూడెంట్స్ నీ వెనక ఎలా మాట్లాడుకుంటున్నారో విని సిగ్గుతో చితికిపోయాను మమ్మీ'' హఠాత్తుగా దుఃఖం తన్నుకువచ్చి కిరణ్ స్వరం జీరబోయింది. రానీ అంతలోనే సంబాళించుకుని ''నువ్వు క్లాసులో పాఠాలు చెప్పవట. గైడ్‌లో వున్నది బోర్డుమీద రాస్తావు. లేదా లీడర్‌ని చదవమని చెప్పి మిగిలినవాళ్ళని రాసుకోమంటావట. దానికి తెలిస్తే కదా మనకు చెప్పడం అని స్టూడెంట్స్ నీ గురించి నీచంగా కామెంట్స్ చేస్తున్నారు మమ్మీ. నీవే కాదు మీ స్కూలు టీచర్స్ అంతా అంతే. చాలామంది క్లాసులకే వెళ్లకుండా పిల్లలతో జాంకాయలు, వేరుశెనగకాయలు తెప్పించుకుని తింటూ కాలక్షేపం చేస్తారట. పరీక్ష ఫలితాలు బాగులేకపోతే అధికారులతో తంటా అని ధారాళంగా కాపీలు కొట్టుకోనిస్తారట. ఏడో తరగతి పరీక్షల్లో అయితే మీరే జవాబులు చెప్పేస్తారట!''

తేలు కుట్టిన దొంగే అయింది కాత్యాయని.

''మీ స్కూలు ఘనత నీకు తెలుసు కాబట్టి నన్ను మీ స్కూలులో చేర్పించకుండా ఖరీదైన కాన్వెంట్‌లో పడేశావు. కానీ అక్కడున్నదెవరు? నీలాంటి టీచర్లే. కాపీరాణులు. విద్యార్థులకు అర్థం అయ్యేట్టు బోధించడం చేతగాక సందేహాలు అడిగితే ఎదిరిస్తున్నావంటూ సస్పెండ్ చేశారు. అసలు మీలాంటివాళ్ళని ఎవరైనా ఎందుకు గౌరవించాలి మమ్మీ! అహోరాత్రులు కష్టపడి చదివి నిజాయితీగా పరీక్షలు రాసేవాడికంటే కాపీరాయుళ్ళకు ఎక్కువ మార్కులొస్తున్నప్పుడు కష్టపడి చదవడం ఎందుకు మమ్మీ? కాపీతో పరీక్ష పాసై లంచంతో ఉద్యోగం కొనుక్కున్న నీకు నిజంగా మందలించే హక్కు, అర్హత ఉన్నాయా మమ్మీ! నువ్వు చేలో మేస్తూ నన్ను మాత్రం గట్టున మేయమంటావేం మమ్మీ? మార్కుల కోసం, ఉద్యోగం కోసం రాధ ఆంటీ, రమేష్ లాంటి అమాయకులు బెంగపడి చావాలి గాని మనకెందుకు బెంగ? చెప్పు మమ్మీ? చెప్పు.''




కాత్యాయని తల తిరిగిపోయింది. ముఖం ఎక్కడ దాచుకోవాలో అర్థంకాక విలవిలలాడిపోతోంది.

నిద్రలో కాంతి కలవరిస్తోంది. 'ది చైల్డ్ ఈజ్ ది ఫాదర్ ఆఫ్ మ్యాన్.'

★